## కామెడీ కథ

# బంగారు లేడీ

డా. పేరాల శ్రవణ్‌కుమార్

**"కవిత్వాలకే అమ్మాయిలు లైన్లో పడిపోయే రోజులట్రా ఇవీ పిచ్చినాన్నా! నాలాగ మోడ్రన్ లుక్సూ, శాంట్రోకారా, బ్యాంక్ బ్యాలెన్సా! నీకేం ఉన్నాయని ఆ పిల్ల నిన్ను లవ్వాడ్తుంది చెప్పు? నామాట విని ఈసారికి ఈ 'బంగారు లేడీ'ని నాకొదిలెయ్. ఇలాటి ఎడ్యుకేటెడ్ మోడర్న్ గాల్స్‌ని నేనెలా లైన్లో పెడతానో చూసి నేర్చుకో. నేనేం పెళ్ళీ గిళ్ళీ అంటూ లొల్లిపెట్టే టైపు కాదు. నా ముచ్చట తీరేక కావాలంటే నువ్వే ఆ అమ్మాయిని..."**

"రేయ్ రాంబాబూ! చాలా తప్పుగా మాట్లాడ్తున్నావ్" తర్జని చూపి బెదిరించాడు సిరిశ్రీ. చూసేవాళ్ళకి ఆమె ఎదురింట్లో ఉంటున్నట్టనిపించినా నిజానికి గత కొంతకాలంగా ఆమె సిరిశ్రీ గుండెల్లోనే నివాసముంటోంది.

"రాంబాబు కాదు ర్యాంబో! మైండ్ యువర్ లాంగ్వేజ్" రెండు తర్జనిలూ తుపాకి బేరల్స్‌లా గురిపెట్టి వార్నింగిచ్చాడు రాంబాబు. మోడర్న్‌గా ఉంటుందని తన పేరుని ర్యాంబోగా మార్చుకున్న విషయం తెలిసీ ఇలాంటి గొడవొచ్చిన సందర్భాల్లోనే ప్రత్యేకించి 'రాంబాబూ' అంటూ దీర్ఘం తీసి పిలిచి ఇరిటేట్ చెయ్యడం ఈ సిరిశ్రీగాడికో శునకానందం. కసిగా గొణుక్కున్నాడు రాంబాబు.. ఐమీన్ ర్యాంబో.

డిగ్రీదాకా జిగ్రీదోస్తుల్లా కలిసి చదువుకున్న వాళ్ళిద్దరికీ ఆ తర్వాత దారులు వేరైనా ఒకే ఊళ్ళో జాబ్స్ రావడానా, బ్రహ్మచారులు కావడానా మళ్ళీ హాస్టల్లో రూంమేట్స్‌లా సహజీవనం చేసే ఛాన్సొచ్చింది. ఇద్దరూ కల్సి ఒకే ఫ్లాట్ రెంటుకి తీసుకుని అన్నదమ్ముల్లా కలిసే ఉంటున్నారు రెండేళ్ళుగా. కాకపోతే స్వభావాలే వేరు. రాంబాబుకి మాంచి డబ్బులొచ్చే డిపార్ట్‌మెంట్లో ఉద్యోగం. దానికి తోడు తండ్రి ఇచ్చిన ఆస్తీ, అందమైన పువ్వు అందకపోయినా కొమ్మవంచి మరీ అంది పుచ్చుకునే నేర్పూ, మధువు గ్రోలేదాకా వదలనని మంకుపట్టు పట్టే మనసూ, దాన్ని ఎగదోసే వయసూ, అన్నీ ఒకదాన్తో ఒకటి పోటీపడుతున్నాయ్.

"పెళ్ళంటే నూరేళ్ళ పెంట. ప్రేమంటే టెంపరరీ చలిమంట!" బాగా మందెక్కువైనప్పుడు అతగాడు ప్రవచించే 'లిమరుక్కు'ల్లో ఇదొటి.

సిరిశ్రీ అందుకు పూర్తి విరుద్ధం. తెలుగు లెక్చరర్గా ఉద్యోగం చేస్తున్న సిరిశ్రీకి కవిత్వం ఒకటో ప్రాణం. దాన్తర్వాతే మిగితా ఐదుప్రాణాలూనూ! ఇన్నాళ్ళూ బ్రహ్మచారిగా ఉండిపోయిన కారణం కూడా ఓ రకంగా కవిత్వమే. విశాల హృదయమున్న అమ్మాయిలెంతమందినో చూసినా, తన హైకూల్ని మెచ్చే రసహృదయమున్న వనిత దొరక్కపోవడంతో 'అచ్చుకాని కవితలా' అలా ఉండిపోయాడిన్నాళ్ళూ! అయినా పట్టువదలని 'కవి'క్రమార్కుడిలా ట్రై చేస్తూనే ఉన్నాడు. ఆ ప్రయత్నంలోనే వెదకబోయిన తీగెలా ఈ మెరుపుతీగె తారసపడింది.

ఇక హరిణి. మీడ్డీ తొడిగిన మేనకలా, ఊరించే ఊర్వశిలా ఉంటుంది. వేయేల? ఆ స్కిన్ టైట్ జీన్స్ చూసి జివ్వుమనకపోతే అది మగ హృదయమే కాదు. ఏదో ఉద్యోగం చేస్తూ సివిల్స్‌కి ప్రిపేరవుతోందనీ, ఆ సమున్నత లక్ష్యంతోటే ఆ సింగిల్ బెట్‌రూం ఇంట్లో సింగిల్‌గా ఉంటోందనీ భోగట్టా.

హరిణి నాదంటే నాదనే వాదం శృతిమించుతోంది.

"మళ్ళీ అంటాను రాంబాబూ అని. కామం కామెర్లలా కమ్మేసింది నీ కళ్ళకి. అందుకే అలా మాటాడ్తున్నావ్. వయసులో ఉన్న పిల్ల ఏదో మోడ్రన్‌గా డ్రెస్ చేస్కుంది కదా అని అంత చీప్‌గా కట్టేస్తావా ఆమెని? ఆమె నా అనురాగ దేవతరా! నా హైకూల్తో ఆమె మనసు దోచి మనువాడకపోతే నాపేరు సిరిశ్రీ ఎలియాస్ సిరివరపు శ్రీనివాసే కాదు" ఛాలెంజింగ్గా అనేశాడు సిరిశ్రీ.

"నీ మొహం! మరీ అంత ఓవర్ కాన్ఫిడెన్స్ పనికిరాదు లేరా సిరీ. సరే మన స్నేహానికి విలువిస్తూ నీకు మూడే మూడురోజులు టైమిస్తున్నా. ఈ మూడ్రోజుల్లో నీ ప్రేమలో ఆమె కాస్తయినా పడిందో సరేసరి. లేదా నాల్గోరోజు నా మన్మథమాయలో హరిణిని ముంచి తేల్చడం ఖాయం" విలాసంగా కీచైన్ తిప్పుతూ అన్నాడు ర్యాంబో.

సమాధానంగా దోసె వేసినంత ఆశువుగా ఓ హైకూ పేల్చాడు సిరిశ్రీ.

'అపరా ఎగతాళి, నేనే కడతా తాళి.
హరిణికీ నాకూ పెళ్ళి, నువ్వేడ్చేలా కుళ్ళి.'

ఏకంగా ఉద్యోగానికి మూడ్రోజులు సెలవే పెట్టేసేడు సిరిశ్రీ, ఆమెని పలకరించాలి. తన మూగప్రేమ గుండెల్లోనే ముక్కిపోయి మురిగిపోకూడదు. కానీ ఎలా? ఆ ఛాన్సేదో కరెంటుబిల్లు రూపంలో రానే వచ్చింది.

ఆరోజు సాయంత్రం వరండాలో కూర్చుని మిల్స్ అండ్ బూన్ చదువుకుంటోంది హరిణి.

నడిచొచ్చే ట్యూబ్‌లైట్‌లా తెల్లటి పైజమా లాల్చీల్లో తన వేపే వస్తున్న ఆ ఆకారాన్ని వింతగా చూసింది.

"మీరు ఇంట్లో లేని టైంలో మీ కరెంట్ బిల్ నాకిచ్చేడు కుర్రాడు" బిల్ అందిస్తుంటే ఆపాద మస్తకమూ మలేరియా పేషంటే అయిపోయాడు సిరిశ్రీ. టైట్ వైట్ జీన్స్‌లో లైట్ బ్లూ టీషర్ట్‌లో సునామీ ముందు సముద్రంలా వెల్లువెత్తుతున్న ఆమె పరువాలు చూడగానే అప్పటిదాకా 'లబ్ డబ్' మంటున్న తనగుండె 'లవ్ లవ్' అని బీటు మార్చినట్టనిపించింది సిరిశ్రీకి. అంతలోనే నవ్వుకున్నాడు.

"ఇంకెక్కడి గుండె! అదెప్పుడో ఈ అందాల భరిణకిచ్చేశాను. బహుశా ఆ శబ్దాలు ఏ లివర్లోంచో వస్తూండి ఉంటాయ్."

ఆమె చిటికెల్తో ఈ లోకంలోకొచ్చి తనని తాను పరిచయం చేసుకున్నాడు.

"నాపేరు సిరిశ్రీ. గవర్నమెంటు కాలేజీలో లెక్చరర్‌ని. హైకూలు రాస్తాను."

"ఎందుకు? అసలేంటవి?" ఏం అర్థంకాక అడిగిందామె.

"ఎందుకంటే.." కాసేపు నీళ్ళు నమిలి అన్నాడు. "అదో హాబీ అన్నమాట. హైకూ అంటే ఓ రకం చిరు కవితలన్నమాట. దేనిమీద పడితే దానిమీద చెప్పుకోవచ్చునన్నమాట!"

"అన్నమాట, అన్న'మాట' వీడికి బాగా అలవాటన్నమాట!" నుదురు రాసుకుంటూ అనుకుందామె విసుగ్గా.

"ఉదాహరణకి, ఈ కరెంటుబిల్లే తీస్కోండి. 'వొచ్చింది కరెంటు బిల్లు, పెడుతుంది జేబుకి చిల్లు... ఇదో హైకూ"

అయోమయంగా చూసింది హరిణి.

"వారంలోగా బిల్లు కట్టు, లేకుంటే కనక్షన్ కట్టు... ఇది మరో హైకూ" అంటూ ఇకిలించేడు సిరిశ్రీ.

ఠప్! బల్బు పేలినట్టు శబ్దం. ఆ వెంటనే గదంతా అంధకారం.

"పవర్నే కట్ చేసేంత పవరుందా ఇతగాడి హైకూలకి!" ఆశ్చర్యపోవడం హరిణి వంతైంది.

ఇంతలో పనిపిల్ల పాకీజా కాఫీ కప్పుతో ప్రత్యక్షమైంది.

"అబ్బే ఎందుకమ్మా!" అంటూనే కప్పు అందుకుంటూ "కావాలంటే కాఫీ మీద కూడా చెప్పొచ్చు" అంటూ ఆమె పర్మిషన్ కోసం చూడకుండానే-

"వయసు పాలలో వలపు డికాషన్, చక్కెరే నువ్వైతే బ్రతుకే బ్రూ కాఫీ..." మరో హైకూ పీకేడు సిరిశ్రీ.

అంతా నీవల్లే అన్నట్టు పాకీజా కేసి గుడ్లురిమి చూసింది హరిణి.

'అమ్మగారి కోసం తెచ్చిన కాఫీ అయ్యోవడో లాగేసుకున్నాడు. దానికి నేనేం చెయ్యను' అన్నట్టు సిరిశ్రీ కేసి ఓ చూపు విసిరి తలదించుకుంది పాకీజా.

ఇంతలో సిరిశ్రీ చేతిలో కప్పు చేతిలోనే 'ఠాప్' అంటూ

పగిలిపోయింది. కాఫీ చేతిమీద ఒలికినా నొప్పికి కాస్త నకిలించాడుగానీ హైకూల్ని ఆపలేదు సిరిశ్రీ.

హరిణి కళ్ళలో ఆశ్చర్యం. 'అంత గట్టి పింగాణీ కప్పు చేతిలోనే పగల్డమా? ఎలా సాధ్యం? ఎలా సాధ్యం? అదంతా కవితల మహిమేనా?'

ఓ సందేహం! ఆ సందేహంలోంచి ఓ సందేశం! ఓ ఐడియా! యా! యాహూ! ఒక్కొక్క ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది. ఏమో చూద్దాం అనుకుందామె.

"ఫాంటాస్టిక్ సిరిశ్రీగారూ! మీ హైకూలు సూపర్బ్. నిజంగా రికార్డ్ చేస్కోవాల్సినంత రికార్డు స్థాయిలో ఉన్నాయి" అంటూ షెల్ఫ్ వేపు గెంతి బ్యాటరీతో నడిచే తన టేప్ రికార్డరు తెచ్చి సిరిశ్రీ ఎదురుగా పెట్టింది క్యాసెట్ ఫీడ్ చేసి.

"నా హైకూలంటే మీకంతిష్టమా!" ఉబ్బితబ్బిబ్బవుతూ అడిగేడు సిరిశ్రీ.

"చెప్తా..చెప్తా.. కుక్కపిల్ల.. అగ్గిపుల్ల.. అని కదండీ అన్నారు శ్రీశ్రీగారు. ఏదీ ఎలకపిల్ల మీదో హైకూ చెప్పండి చూద్దాం!" రెచ్చగొట్టింది.

"ఓస్! అదెంత పని" పొజిషన్‌లో కొచ్చాడు సిరిశ్రీ.


"వంటింట్లో ఎలక ఉంటుందా, కదలక
బోనులో పడేదాకా ఆగేనా లుకలుక"

ఎలకల మీద హైకూలు పలుకుతూనే ఉన్నాడు సిరిశ్రీ. మధ్యమధ్యలో ఏదో పనున్నట్టు కిచెన్ వేపు వెళ్ళొస్తోంది హరిణి. వెళ్ళేటప్పుడు సందేహం. వచ్చేటప్పుడు సంతోషం.

"ఏదీ! బొద్దింక మీద చెప్పండి చూద్దాం. బల్లి మీద.. నల్లి మీద" సిరిశ్రీని రెచ్చగొట్టి చివరికి దోమల మీద కూడా ఆశు హైకూలు పీకించుకుని క్యాసెట్‌లో రికార్డ్ చేసుకుంది హరిణి.

కవితా వస్తువులు- అసహ్యంగా అనిపించినా అది తన కవితాశక్తికి ఈ రసగుల్లా లాంటి పిల్ల పెట్టిన పరీక్షగా భావించి విజృంభించి చెప్పేడు హైకూలు. కవితాఝురి ఆగిపోగానే భళ్ళున లైట్లు వెలిగాయి.

"వావ్ సిరిశ్రీగారూ! నిజంగా హేట్సాఫ్ టు యువర్ హైకూస్! ఇందాక మీరు కరెంటుబిల్ మీద చెప్పేరు. పవర్ కట్ అయింది. కాఫీ మీద చెప్పేరో లేదో కప్పు కాస్తా ఢాం అంది. అప్పుడే అనిపించింది నాకు. మీ కవితల్లో



అంతర్లీనంగా ఏదో డిస్ట్రక్టివ్ ఎలిమెంట్, ఏదో రిపెల్లెంట్ ఎఫెక్ట్ దాగి ఉందనీ, దాన్ని వాడుకోవాలనీ! అందుకే ఎలకల్నీ, బొద్దింకల్నీ కవితా వస్తువులుగా ఇచ్చేను.

నేనీ కొంపలో చేరినప్పట్నించీ ఎన్ని హిట్‌లు కొట్టినా చావని బొద్దింకలు మీ 'సూపర్ హిట్' కవితల ధాటికి పుంజీలు పుంజీలుగా చచ్చూరుకున్నాయి. ఎలక్ట్రిక్ బోన్లకి కూడా లొంగని మా ఎలకల్ని ఏ 'ఎలక ట్రిక్స్' వాడేరోగానీ మీ కవితల్తో ఎలిమినేట్ చేసి పారేశారు. మీరు హైకూలు చదువుతుంటే కనీసం ఒక్కదోమ కూడా నన్ను కుట్టలేదంటే అది మీ హైకూల రిపెల్లెంట్ పవర్ కాక మరేంటి? థాంక్యూ సోమచ్" హుషారుగా షేక్‌హాండిచ్చింది.

"చివరికి నా కవితలు నల్లుల్ని, దోమల్ని చంపడానికా"

గాలి తీసిన బెలూన్‌లా అయిపోయాడు సిరిశ్రీ.

"మీమీద ఓ రెండు అందమైన హైకూలు.." ఆశ చావక అనేశాడు.

"అమ్మో ఇంకేమన్నా ఉందా!" గుండెల మీద చెయ్యే సుకుంటూ అంది హరిణి. "వద్దు సిరిశ్రీగారూ.. ప్లీజ్.. నేను కూడా ఎలక చావు చావాలనా మీ కోరిక? బైదివే మళ్ళీ ఎల కలు, దోమలు విజృంభిస్తే మీ క్యాసెట్ పెట్టి వాటిని ఛంపే స్తాగానీ మీరు రేపట్నించీ కష్టపడి రానక్కర్లేదు.. థాంక్స్" చెప్పి భళ్ళున తలుపేసింది హరిణి.

"చెప్తే విన్నావ్రా హైకూలట హైకూలు!" పగలబడి నవ్వేడు ర్యాంబో. "నేనో హైకూ చెప్పనా.. అయ్యింది నీ పని క్రయ్యింగ్, రేపట్నించి హరిణితో నా డేటింగ్."

ముఖం మాడ్చుకుని తన గదిలోకి దూరేడు సిరిశ్రీ.

హరిణి పన్జేసే స్కూల్లో క్లర్కుని పచ్చనోటుతో కొట్టి ఆమె డేటాఫ్ బర్త్ సంపాయించేడు ర్యాంబో. తీరా చూస్తే మర్నాడే ఆమె బర్త్‌డే! ఆమె గ్రేట్‌గా ఫీలయ్యేలా గ్రాండ్‌గా గ్రీట్ చేస్తే చాలు పిట్ట వల్లో పడ్డట్టే. అదే అదనుగా ఆమెని గమ్మత్తుగా గుమ్మెత్తించి ఏదేదో చేసి ఆ అమ్మాయి నించి 'ఏదో' దోచెయ్యాలి! ఎలా? ఎలా? ఆలోచించగా... చించగా సూపర్ ఐడియా తట్టింది. కానీ అందుకు పనిమనిషి పాకీజా సాయం కీలకం. ఎందుకంటే హరిణికి నమ్మిన బంటు పాకీజా. హరిణి వాళ్ళ పెరటిగుమ్మం తాళం పాకీజా దగ్గరే ఉంటుంది. రోజూ తెల్లారుఝామునే అమ్మగార్ని లేపకుండా తనే పెరటితాళం తీసుకుని లోపలికెళ్ళి గదు లన్నీ శుభ్రం చేస్తుంది.

ఆరోజు సాయంత్రం పని ముగించుకుని హరిణి వాళ్ళిం టినించి బయల్దేరింది పాకీజా.

ర్యాంబో ఆమె వెనక పడ్డాడు. "పాకీజా.. ఏయ్ ఒక్క మాట.. ఇదిగో పాకీజా."

"ఏంట్రా ఒక్కమాట" మణుగు బరువున్న వస్తువేదో ర్యాంబో భుజం మీద పడింది.

అది బండరాయి కాదనీ, పాకీజా మొగుడు సైదులు చెయ్యనీ అర్థమయ్యేసరికి ర్యాంబో పై ప్రాణాలు పైనే పోయాయ్.

"ఏంబే! ఈ సైదులు పెళ్ళాన్నే రమ్మంటావు బే.. పేరు పెట్టి పిలుస్తావ్ బే.. ఢిష్యూం.. డబ్బులిస్తావు బే.. ఢిష్యుం..ఢిష్యుం.. అంత తీటగా ఉందా..ఢిష్యుం" రోట్లో వేసి కచ్చాపచ్చాగా దంచిన చింతకాయ చందాన అయిపో తోంది ర్యాంబో పరిస్థితి.

"ప్లీజ్..సైదులూ.. చచ్చేలా ఉన్నాను. ఇక ఆపు.. చెప్పేది చెప్పనివ్వు" సైదులు మొరటు దెబ్బలకి ఆకాశం పచ్చబడ్డట్టు, అంతలోకే ఎర్రబడ్డట్టూ అనేక రంగులు చూపిస్తున్నాయి.

"అమ్మా..పాకీజా, చెల్లీ..నా సిరిమల్లీ.. ఈ వీరబా హుణ్ణి వీరబాదుడు ఆపమను.." చంటాళ్ళా పాకీజా పాదాలు చుట్టేసి ఏడుపు షురూ చేశాడు ర్యాంబో.

"సస్తాడేమో వదిలై మావా!" అన్న పాకీజా మాటతో సగమూ, జేబులో కుక్కబడ్డ వెయ్యి నోటుతో సగమూ మెత్తబడ్డాడు సైదులు. ర్యాంబో కోరిక ప్రకారం హరిణి పెరటి తలుపుతాళం పాకీజా చేతిలోంచి ర్యాంబో చేతికొచ్చింది.

* * *

స్నానం చేసి కొత్తడ్రెస్‌లో హాల్లోకొచ్చిన హరిణికి స్వీట్ సర్ప్రయిజ్. స్థాణువులా నిలబడిపోయింది. గదినిండా అందమైన రోజాపూల బొకేలు. గోడలన్నిండా లైఫ్‌సైజులో అతికించబడ్డ బర్త్‌డే గ్రీటింగ్స్! హాల్లో సెంటర్ టేబుల్ మీద 'లవ్' షేప్‌లో అమర్చబడిన రోజాపువ్వు రంగు బర్త్‌డే కేక్! దానిమీద అందంగా మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ద డే.. బై.. ర్యాంబో..

"వావ్..ఏంటిదంతా? ఎవరీ ర్యాంబో.. పాకీజా.. ఎవరు తెచ్చారివన్నీ?"

"నాకేం తెలుసమ్మా! మీరే తెచ్చుకున్నారనుకున్నా! నేనొ చ్చేసరికే ఉన్నాయి అవన్నీ" వెయ్యి నోటిచ్చిన ఇన్స్పిరేష న్‌తో అవార్డు స్థాయిలో నటించేసింది పాకీజా.

"హాల్లో మిస్ హరిణీ! విష్ యూ హేపీ బర్త్‌డే! ఐయామ్ ర్యాంబో!" చెక్స్‌షర్ట్, డార్క్‌కలర్ జీన్స్‌లో స్మార్ట్‌గా వాకిట్లో బొకేతో నిల్చుని నవ్వుతూ పలకరించిన ఆ మన్మధాకారుణ్ణి చూసి ఒక్కక్షణం గుండె లయ తప్పింది హరిణికి.

"సో! మీరేనా ర్యాంబో! వాటీజ్ ఆల్ దిస్? అసలు నా ఇంట్లోకెలా ఎంటరయ్యారు మీరు?" చిరుకోపంగా అంది.

"మీరు నా హృదయంలోకెలా ఎంటరయ్యారో అలాగే!" సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ ఫ్రాంక్‌గా అనేశాడు ర్యాంబో. పిరికిపందల్లా వెనకనించి కామెంట్స్ విసిరి పారి పోయినవాళ్ళేగానీ ఎదురుపడి ధైర్యంగా ఇలా ఎవరూ మాట్లాడలేదు.

"కూర్చోండి" కాస్త సిగ్గుపడింది హరిణి. ఆడది నచ్చిన వాడి దగ్గరే సిగ్గుపడ్తుందట. ఎక్కడో చదివింది గుర్తొచ్చి మరీ సిగ్గుపడింది.

"కూర్చోడానికి రాలేదు. కేక్ కట్ చేయించడానికొచ్చాను" చొరవగా ఆమె చేయి అందుకుని కేక్ కట్ చేయించాడు. ఆమెతో చిన్నముక్క కొరికించి, మిగతా ముక్క తను నోట్లో వేసుకున్నాడు. "హా స్వీట్" అన్నాడు క్రీగంట ఆమెనే చూస్తూ, కొంటెగా.

ఏంటో ఇతనెంత అడ్వాన్సవుతున్నా తిట్టాలనిపించట్లేదు.

"నీ బ్యూటీ ముందు ఈ బర్త్‌డే డ్రెస్ వెలవెల బోతోంది హరిణీ! అసలు నీ అందాల్ని భరించగలిగే డ్రెస్‌లు ఈ ఊర్లో ఉన్నాయో లేదో అలా షాపింగ్‌కెళ్ళి ట్రై చేద్దామా?"

చనువుగా ఆమె చెయ్యందుకుని తన లైట్ బ్లూ కలర్ శాంట్రో జింగ్ కేసి నడిపించాడు.

ఎప్పుడు కార్లో కూర్చుందో ఆమెకే తెలీదు. షాపింగ్ మాల్‌లో బోల్డు డ్రెస్‌లు కొన్నాడు ఆమెకోసం. ఓ గోల్డ్ నెక్లెస్ చూసి ముచ్చటపడింది హరిణి. "దాన్దేముంది తీస్కో హరిణీ..ప్లీజ్.."

'ఇంత అందాలరాశిని పొందాలంటే ఈమాత్రం ఖర్చుకి వెనకాడకూడదు' అనుకుంటూ భారీగా భారీ బిల్లు పే చేశాడు ర్యాంబో.

గ్రాండ్ బేలో లంచ్, సంగమ్‌లో 'కుఛ్ కుఛ్ హోతాహై' అట్నించి అలా డిస్కో. ఒకరినొకరు హత్తుకుంటూ అలా ఎంతసేపు డాన్స్ చేశారో వాళ్ళకే తెలీదు. అర్ధరాత్రి దాటు తుండగా అన్నాడు. "మా ఫ్లాట్‌కి వెళ్దామా?" ఆమె తియ్యగా నవ్వింది.

కార్లోంచే ఫోన్ చేశాడు సిరిశ్రీకి.

"సిరీ! ఈ రాత్రికి హరిణి నాతో మన ఫ్లాట్‌లోనే ఉంటుంది. ఏం అనుకోకుండా నువ్వీ రాత్రికి వేరే ఎక్కడి కైనా..." అర్థోక్తిలో ఆపిన అర్థింపులో ఏదో ఎగతాళి. విజయ గర్వం.భగ్గుమన్న హృదయంతో మరో ఫ్రెండ్ గోపాల్ రూంకి బయల్దేరాడు సిరిశ్రీ బాధగా.

* * *

తెల్లారింది. పాలు పోసే యాదవ్ పరిగెత్తుకొచ్చేడు. "సిరి శ్రీగారూ! ఇక్కడున్నారా? పాల ప్యాకెట్ ఇద్దామని మీ ఫ్లాట్ కెళ్ళా! ర్యాంబోగారి పరిస్థితేం బాలేదు. మూల్గుతున్నారు. కిటికీలోంచి చూసి భయం వేసి మిమ్మల్నెతుక్కుంటూ వచ్చా!"

ఆదరాబాదరాగా ఫ్లాట్ చేరాడు సిరిశ్రీ. 'శాంట్రో' లేదు వాకిట్లో. ఫ్లాట్ బయటనించి గడియపెట్టేసి ఉంది. గడియ తీసి బెడ్‌రూంలోకెళ్ళి చూస్తే, బెడ్‌కి ప్లాస్టిక్ తాళ్ళతో కట్టబడి ఉన్నాడు ర్యాంబో. నోట్లో గుడ్డలు, ఒంటిమీద బెల్టుదె బ్బలు.కట్లు విప్పి, కాస్త నీళ్ళు తాగించాక ఓపికొచ్చి మాట్లాడ్డం మొదలెట్టేడు. "అది వట్టి మాయ లేడిరా! నన్ను మందుమత్తులో ముంచి ఇలా తాళ్ళతో కట్టేసింది. అదేమంటే ఇంగ్లీష్ 'సిన్మా' టైపు సరసం అంది. నోట్లో గుడ్డలు కుక్కి, నా బెల్టుతో నన్నే బాదింది. అదీ సరసమే అంది. చివరికి నా వజ్రాల ఉంగరాలు, బ్రేస్‌లెట్టూ, బీరు వాలో క్యాషూ, టీవీ, విసిడీల్తో సహా అన్నీ దొంగిలించి నా కార్లోనే ఉడాయించింది" భోరుమన్నాడు.

"తన సర్వస్వం నువ్వు దోచుకుందామనుకుంటే నీ సర్వస్వం తనే దోచుకుందన్నమాట. ఇలా ఒంట రిగా ఉంటూ ఇళ్ళు మారుతూ అబ్బాయిల్ని వల్లో వేసుకుని మోసం చేసే అమ్మాయిల ముఠా ఒకటి సిటీలో దిగిందని నిన్ననే సిటీ కేబుల్‌లో హెచ్చరిం చేరు పోలీసులు.. నువ్వు చూళ్ళేదా? అయినా ఒరే ర్యాంబో! రూంకి రమ్మనగానే వచ్చేసినప్పుడే కాస్త డౌట్ పడొద్దట్రా!" వ్యంగ్యంగా నవ్వేడు సిరిశ్రీ.

"ర్యాంబో కాదు! రాంబాబే రాంబాబే!" బుద్ధొ చ్చింది రాంబాబుకి.

